
అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 39 | ఆదివారం 15 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-



# మైసూరులో మహాశివరాత్రి వైభవం



## దత్తపీఠంలో శివరాత్రి ఉత్సవాలు రేపు ముగింపు


## అవధూత దత్త పీఠంలో భక్తుల రద్దీకి ఏర్పాట్లు



**(అంకుశం, మైసూరు, ఫిబ్రవరి 15):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మైసూరులోని అవధూత దత్త పీఠంలో వైభవంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శ్రీ గణపతి సచ్చిదానంద ఆశ్రమం ఆధ్వర్యంలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల సమక్షంలో జరగనున్నాయి. ఫిబ్రవరి 14న మహారాజా కాలేజ్ మైదానంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం గిరిజా కళ్యాణం, దివ్య నామ సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు.ఆదివారం ఉదయం మహా రుద్ర హోమంతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. నంది విగ్రహానికి పూజ, శ్రీ చక్ర పూజ, మహా రుద్ర హోమ పూర్ణాహుతి నిర్వహిస్తారు. పరమ పూజ్య శ్రీ స్వామిజికి గౌరవ డాక్టరేట్ ప్రదానం కార్యక్రమం కూడా జరుగనుంది. అనంతరం భక్తులచే మహా రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం గంగోత్సవం సందర్భంగా పవిత్ర జల కలశాలతో శివుడి ఊరేగింపు నిర్వహిస్తారు. రుద్రాభిషేకం, సహస్ర కళశాభిషేకం కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తనున్నాయి. రాత్రి కర్ణాటక సంగీత కచేరీలు, వేద మంత్రాల జపంతో ఆలయం నిండా భక్తి వాతావరణం నెలకొననుంది. తెల్లవారుజామున మహా మంగళారతితో కార్యక్రమాలు ముగియనున్నాయి. ఇదిలా ఉండగా ఫిబ్రవరి 21న త్యాగరాజ స్వామి ఆరాధన కార్యక్రమం, 22న హోస్యోత్సవం నిర్వహించను న్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మైసూర్ దత్త పీఠం ప్రతినిధులు ప్రసాద్ మేనేజర్ రమేష్ ఇతర దత్తపీఠం ప్రతినిధులు పాల్గొన్నారు







# శివ మహోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

### శ్రీ అరుణాచలేశ్వరుని దివ్య కళ్యాణం వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే

### భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ఎమ్మెల్యే





**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 15**


అనంతపురం నగరంలో ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన శివమహోత్సవంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎం.ఎస్.రాజు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ గార్లతో కలిసి పాల్గొన్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో 10వేల 8వందల శివలింగాలు, రుద్రాక్షలతో మహా అభిషేక కార్యక్రమం వైభవంగా సాగింది. అభిషేక కార్యక్రమంతో పాటు శ్రీ అరుణాచలేశ్వరుని దివ్య కళ్యాణ వేడుకను వారు వీక్షించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఇంత పెద్ద ఆధ్యాత్మిక వేడుకలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఇన్ని వేల మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సాధారణ విషయం కాదన్నారు. ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన చల్లా లక్ష్మీప్రసాద్ దంపతులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు...

# ప్రజలకు సీఎం చంద్రబాబు మహాశివరాత్రి శుభాకాంక్షలు



(అంకుశం, అమరావతి, ఫిబ్రవరి 15): మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం కొలువై ఉన్న పవిత్ర భూమి మన రాష్ట్రం. భక్త సులభుడైన శివుడు ఈ రోజే లింగాకారంలో ఆవిర్భవించాడని శివపురాణం చెబుతోంది. ఈ పర్వదినాన శివారాధనతో మహాశివుని అనుగ్రహం కలిగి అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను. శివార్చన, జాగరణలతో మహా శివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం. పరమశివుని అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ఏపీలోని ప్రజలకు సూపర్ న్యూస్



### ఉచిత విద్యుత్ పథకం అమలుకు డేట్ ఫిక్స్.. వీరందరికీ ఫ్రీ..

### ఏపీలోని కూటమి ప్రభుత్వం మరో పథకం అమలుకు సిద్దమైంది

### ఏపీలో వారికి ఉచిత విద్యుత్ అందించేందుకు సిద్దమైంది

### ఏప్రిల్ 1వ తేదీ నుంచి పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది

### ఇప్పటికే కేబినెట్ దీనికి ఆమోదం తెలపగా.. ఇటీవల బడ్జెట్‌లో కూడా నిధుల కేటాయింపు పూర్తయింది.

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరో పథకం అమలుకు సిద్దమైంది. ఈ మేరకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసింది. చేనేత లు, మరమగ్గాల కార్మికులకు ఉచిత విద్యుత్ అందించే పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దమైంది. ఈ పథకం ద్వారా చేనేతలు, పవర్ లూమ్స్‌కు ఉచిత విద్యుత్ అందించనున్నారు. చేనేతలకు - మిగతా3లో

# పేదరిక నిర్మూలన అమలుకు రూ. 1,876.23 కోట్లు

### గత బడ్జెట్ తో పోలిస్తే ఈ బడ్జెట్‌లో రూ. 143 కోట్లు కేటాయింపు

### మంత్రి కొండపల్లి శ్రీనివాస్

### ఆదాయ వృద్ధి, స్థిరమైన ఉపాధి అవకాశాల సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నది



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రామీణ పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,876.23 కోట్లు కేటాయించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 143 కోట్లు అధికంగా కేటాయించడం, స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత, గ్రామీణ జీవనోపాధుల పురోగతిపట్ల రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని - మిగతా3లో


# ఏపీలోని ప్రజలకు సూపర్ న్యూస్..

-మొదటిపేజీ తరువాయి

200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. గత ఎన్నికలకు ముందు ఈ మేరకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫోస్టోలో కూడా ఈ విషయాన్ని పొందుపర్చారు. దీంతో అధికారంలోకి వచ్చాక ఇప్పుడు ఈ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయాలని కూటమి సర్కార్ నిర్ణయం తీసుకుంది.

**ఏప్రిల్ 1 నుంచి అమలు**

ఏప్రిల్ 1 నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ఏపీ ప్రభుత్వం అమలు చేయనుంది. ఇప్పటికే అర్హులు ఎంపిక పూర్తయింది. అర్హులకు ఏప్రిల్ 1 నుంచి నిబంధనల ప్రకారం ఉచిత విద్యుత్ కల్పించనున్నారు. రాష్ట్ర బడ్జెట్లో కూడా దీనికి నిధుల కేటాయింపు పూర్తయింది. ఈ పథకం వల్ల లక్షకుపైగా కుటుంబాలు లబ్ది పొందనున్నాయని ప్రభుత్వ గణాంకాల ద్వారా తెలుస్తోంది. హ్యాండ్‌లూమ్స్ కార్మికులకు నెలకు రూ.700 వరకు, పవర్ లూమ్స్ కార్మికులకు రూ.1800 వరకు విద్యుత్ ఖర్చులు ఆదా కానున్నాయని ప్రభుత్వం



అంచనా వేసింది. రాష్ట్రంలో దాదాపు 93 వేల కుటుంబాలు చేనేత పనులు చేసుకుంటూ ఆదాయం పొందుతున్నారు. ఇక 11 వేల వరకు మర మగ్గాలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరందరికీ ఉచిత విద్యుత్ పథకం వల్ల ప్రయోజనం జరగనుందని చెప్పవచ్చు. ఈ నిర్ణయంపై చేనేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**కేబినెట్ ఆమోదం**

చేనేతలకు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకానికి ఇటీవల కేబినెట్ కూడా ఆమోదముద్ర వేసింది. లబ్దిదారుల ఎంపిక కూడా దాదాపుగా పూర్తి కావడంతో.. ఏప్రిల్ 1 నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మొత్తం 4 లక్షల మందికి ఈ స్కీమ్ ద్వారా బెనిఫిట్ జరగనుంది. ఇక చేనేత కార్మికులకు మరో కార్యక్రమం కూడా ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్దమవుతోంది. త్వరలో వారికి పింఛన్లు కూడా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. అలాగే త్రిఫ్ట్ ఫండ్‌లతో చేనేతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. త్రిఫ్ట్ నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అటు ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతల కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు ప్రకటించింది. వారి జీవన ప్రమాణాలను పెంచేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంది.

# మళ్లీ ముద్రగడతో రాజకీయం

**కాకినాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కాపు నేతల్లో ఒక కొత్త వివాదం ప్రారంభం అయ్యింది. ముద్రగడ పద్మనాభం కు జగన్మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వడంపై ఇప్పుడు ఆ సామాజిక వర్గం నేతలు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముద్రగడ రాజకీయ నిర్ణయాలు బాగుండవని.. ఆయనను నమ్ముకొని రాజకీయాలు చేయడం అంత మంచిది కాదని వైసీపీ కాపు నేతలు చెబుతున్నారు. ఇటీవల అంబటి రాంబాబు ఎపిసోడ్లో ముద్రగడ పద్మనాభం లేఖ రాయడం పై కాపు నేతలు ఆగ్రహంగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ కాపు నేతలకు అన్యాయం చేసిందంటూ చెబుతూ ఆయన రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. అయితే అది కూటమి ప్రభుత్వం కంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే సెగలు రేపినట్లు వార్తలు వచ్చాయి. అనవసరంగా ముద్రగడ పద్మనాభం ను హైలెట్ చేయడం పగదని సొంత పార్టీ నేతలే జగన్మోహన్ రెడ్డి వైఖరిపై ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది.గడిచిన ఎన్నికలకు ముందు ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా ఆయన జనసేనకు వెళ్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనతో మేలు కంటే కీడు అధికమని పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు సూచించినట్లు వార్తలు వచ్చాయి. అందుకే పవన్ కళ్యాణ్ సైతం వెనక్కి తగ్గారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ముద్రగడ పద్మనాభం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పవన్ కళ్యాణ్ ను ఓడించడంతోపాటు జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేస్తానని శపథం చేశారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని కూడా సవాల్ చేశారు. అలా ఓడించకపోతే తన పేరును ముద్రగడ పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని ప్రకటన చేశారు. అయితే ఆయన మాటలను గోదావరి జిల్లాల్లో కాపు సామాజిక వర్గం అస్సలు పట్టించుకోలేదు. అయితే పవన్ కళ్యాణ్ విషయంలో ముద్రగడ రెచ్చగొట్టిన వ్యాఖ్యలే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులను దూరం చేశాయని ఆ సామాజిక వర్గ నేతలు భావించారు. ఆ ఎన్నికల్లో దారుణ ఓటమి ఎదురైంది. కానీ ఇప్పుడు కూడా జగన్మోహన్ రెడ్డి ముద్రగడ పద్మనాభంను ముందు పెట్టి రాజకీయం చేయడం ఏమిటి అనే ప్రశ్న వినిపిస్తోంది.వాస్తవానికి ముద్రగడ పద్మనాభం 1989 లోనే చివరిసారిగా ఎమ్మెల్యేగా అయ్యారు. 1995లో ప్రత్తిపాడునియోజకవర్గంలో ఆయన ఓడిపోవడంతో తిరిగి ఆ నియోజకవర్గ వైపు చూడనని తేల్చి చెప్పారు. 2009లో పిఠాపురం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2014లో ఇండిపెండెంట్గా పోటీ చేసి ఓటమి చవి చూసారు. తరచూ అభిప్రాయాలు మార్చుకోవడం, అన్ని పార్టీల నాయకత్వాలతో విభేదాలు ఏర్పడడం వంటివి ముద్రగడ పద్మనాభం కు మైనస్ గా మారాయి. ఆయన ద్వారా కాపులను ఆకర్షించాలన్న



ప్రయత్నం సరి కాదన్నది వైసీపీ నేతల వాదన. తాజాగా అంబటి రాంబాబు ఎపిసోడ్లో ప్రభుత్వానికి ముద్రగడ పద్మనాభం లేఖ రాశారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆయన హై కమాండ్ ఆదేశాలు లేనిదే లేఖ రాయరు. అటువంటిది వంగవీటి మోహన్ రంగా, ముద్రగడ పద్మనాభం, అంబటి రాంబాబు తదితరులను టిడిపి వేధించిందని లేఖ రాశారు ఘాటుగా. అయితే దీని ద్వారా లాభం కంటే నష్టమే అధికమని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కాపులు మరింత దూరం జరుగుతారు అన్నది వారి భయం.

**తగ్గేదెలా అంటున్న అంబటి**

మాజీ మంత్రి అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి అయితే అంబటి రాంబాబును అభినందించాల్సింది పోయి అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. ఏదో ఆవేశంతో అన్న మాటలను ఆయన వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పారని.. అటువంటి వ్యక్తిని దండించడానికి మీకు చేతులు ఎలా వచ్చాయి అంటూ మాట్లాడారు. అంబటి జైలుకు వెళ్లిన తర్వాత ఆయన కుటుంబ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ కూడా.. రాజకీయ అనుభవం ఉన్న నేను ఎవరో రచ్చగొడితే.. హుందాగా ప్రవర్తించాల్సిన నేను ఆవేశంతో నోరు జారాను. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అలా మాట్లాడడం తప్పు అని అన్నారని చెప్పుకొచ్చారు.. దీంతో అంబటి రాంబాబు లో బ్రహ్మాండమైన మార్పు వచ్చిందని.. ఆయన పశ్చాత్తాప పడుతున్నారని అంతా భావించారు. కానీ నిన్న మళ్ళీ రిమాండ్ కు తరలించే క్రమంలో అంబటి రాంబాబు హావభావాలు చూస్తే ఒక నిర్ణయానికి రావచ్చు. ఆయన పశ్చాత్తాప పడే రకం కాదని కూడా తేలిపోయింది.అంబటి రాంబాబు అయినా.. ఇంకొకరు అయినా వైసీపీలో ఒక స్క్రిప్ట్ ప్రకారమే మాట్లాడతారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాలను అనుసరించి కామెంట్స్ చేస్తారు. అక్కడ ప్రాయశ్చిత్తం, పశ్చాత్తాపం వ్యక్తం చేసే వారికి చోటు ఉండదు. అలా ఆశించలేము కూడా. అటువంటిది అంబటి రాంబాబు పశ్చాత్తాప పడ్డారు అంటే ఏమనుకోవాలి. నిన్ననే గుంటూరు సివిల్ జడ్జ్ కోర్టుకి వ్యానులో తీసుకు వచ్చినప్పుడు అక్కడ తనకోసం ఎదురుచూస్తున్న అనుచరులు, మీడియా ప్రతినిధులను చూసి గడ్డం కింద నుంచి చెయ్యి తిప్పుతూ.. పుష్ప సినిమాలో అల్లు అర్జున్ మాదిరిగా తగ్గేదేలే అని సైగ చేశారు. అది చూసి ఆయన అనుచరులు కూడా ఉత్సాహంగా రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. పార్టీ డిఎన్ఏ లోనే అది నిండిపోయింది. అటువంటప్పుడు అంబటి రాంబాబు పశ్చాత్తాప పడతారని.. పడ్డారని అనుకుంటే అంతకంటే పొరపాటు ఉండదు అని అర్థమైంది. అరెస్టుకు ముందే అంబటి రాంబాబు చాలా రకాల వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు పై కామెంట్స్ చేసే క్రమంలో ఆయన మీడియాతో మాట్లాడారు. నన్ను అరెస్టు చేసుకుంటారా చేసుకోండి. ఇక్కడే ఉన్నా. అరెస్టు చేస్తే బెయిల్ కూడా అడగను. ఎంత కాలమైనా జైల్లో ఉంటానని కూడా చెప్పేశారు. కానీ ఇప్పుడు ఆయన అనుకున్న మాదిరిగానే జైలు మీద జైలుకు తిరుగుతూనే ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఆయన ముఖంలో పశ్చాత్తాపం కాదు కదా.. విపరీతమైన కోపం కనిపిస్తోంది.

# అన్నామలై... ఏపీ నుంచి రాజ్యసభకు...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికలపైనే ఉంది. జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు స్థానాల కోసం మే నెలలో నోటిఫికేషన్ రానుంది. అధికార కూటమిలో అప్పుడే సమీకరణాలు వేడెక్కాయి. ముఖ్యంగా కూటమిలోని మూడు పార్టీలు ఈ స్థానాలను ఎలా పంచుకుంటాయి? అభ్యర్థులు ఎవరు? అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.వచ్చే జూన్ 21తో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నలుగురు సభ్యుల పదవీకాలం ముగియనుంది. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న బలాబలాల దృష్ట్యా, ఈ నాలుగు స్థానాలూ అధికార కూటమికే దక్కడం ఖాయం. ప్రచారం జరుగుతున్న దాని ప్రకారం టీడీపీ 2 స్థానాలు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం ఉంది.జనసేన పార్టీకి కేటాయించే ఒక స్థానం కోసం పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి పవన్ కళ్యాణ్‌కు సన్నిహితంగా ఉండటం, ఆర్థికంగా అండగా నిలవడమే ఆయనకు సానుకూల అంశాలని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో ఇతర నేతలు కూడా ఉన్నప్పటికీ, సామాజిక, వ్యక్తిగత సమీకరణాల దృష్ట్యా పవన్ ఆయనవైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.తెలుగుదేశం పార్టీకి దక్కే రెండు స్థానాల్లో ఒకదానికి సానా సతీష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోసారి ఆయనకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబు యోచిస్తున్నట్లు టాక్. ఇక రెండో స్థానం కోసం



టీడీపీలో భారీ పోటీ నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్లు, ఇటీవలే పార్టీలో చేరిన కీలక నేతలు ఈ సీటును ఆశిస్తున్నారు. అధిష్టానం మాత్రం సామాజిక సమతుల్యతను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థిని ఎంపిక చేసే ఆలోచనలో ఉంది.అయితే బీజేపీ నుంచి ఎవరు ఎంపికవుతారనేది ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. ఎవరి అంచనాలకు అందని విధంగా, అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ ఓ కొత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయనే కె.అన్నామలై. తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడైన అన్నామలైని ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపే వ్యూహంలో కేంద్ర బీజేపీ పెద్దలు ఉన్నట్లు సమాచారం. దీని వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేడి కొనసాగుతోంది. అక్కడ పార్టీ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించినందుకు అన్నామలై కొంత అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆయనను జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశపెట్టడం ద్వారా ఆ అసంతృప్తిని చల్లార్చవచ్చని హైకమాండ్ భావిస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారిగా, ముక్కుసూటిగా మాట్లాడే నేతగా అన్నామలైకు దక్షిణాది యువతలో మంచి క్రేజ్ ఉంది. ఆయన రాజ్యసభలో ఉంటే దక్షిణాది సమస్యలపై గళం విప్పే అవకాశం ఉంటుంది. టీడీపీ యువనేత నారా లోకేశ్ కు, అన్నామలైకు మధ్య మంచి స్నేహం ఉంది. గతంలో అన్నామలై ఎన్నికల ప్రచారానికి కూడా లోకేశ్ వెళ్లారు. ఈ నేపథ్యంలో అన్నామలై అభ్యర్థిత్వానికి టీడీపీ నుంచి కూడా ఎటువంటి అభ్యంతరం ఉండే అవకాశం లేదు.మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసినప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు విజయసాయి రెడ్డి. అయితే ఇటీవల మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించిన విజయసాయి రెడ్డి పేరు కూడా తెరపైకి వచ్చింది. ఆయన రాజ్యసభకు నామినేట్ అవుతారని కొందరు భావిస్తున్నప్పటికీ, అది బీజేపీ కోటాలో జరుగుతుందా లేదా అన్నది సస్పెన్స్. ఆయన ఇటీవల హిందూ ధర్మం, జాతీయ అంశాలపై చేస్తున్న వ్యాఖ్యలు బీజేపీకి అనుకూలంగా ఉండటం గమనార్హం.ఏది ఏమైనా, జూన్ రాజ్యసభ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త మలుపులు తిప్పబోతున్నాయి. అన్నామలై వంటి జాతీయ స్థాయి గుర్తింపు ఉన్న నేత ఏపీ నుంచి వెళ్తారా? లేదా స్థానిక సమీకరణాలకే పార్టీలు మొగ్గు చూపుతాయా? అన్నది మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

## పేదరిక నిర్మూలన అమలుకు రూ. 1,876.23 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది జీతభత్యాలు, గ్రామ సంఘాల సహాయకులకు గౌరవ వేతనాలు, అలాగే సెర్ప్ మరియు డి.ఆర్.డి.ఎ కార్యాలయాల నిర్వహణ కోసం మొత్తంగా రూ. 464.99 కోట్లు కేటాయించారని తెలిపారు. అదేవిధంగా దీనదయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రూ. 818 కోట్లు, స్టార్టప్ విలేజ్ ఎంటర్‌ప్రైజ్ ప్రోగ్రామ్ కింద రూ. 72 కోట్లు, మహిళా కిసాన్ శశక్తీకరణ కార్యక్రమం కింద రూ. 30 కోట్ల, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ కోసం రూ. 15 కోట్లు కేటాయించారని తెలిపారు. దీనదయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద రాష్ట్రానికి లభించే వాస్తవ కేటాయింపుల ఆధారంగా అదనంగా రూ. 1,200 కోట్లు వరకు పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించినట్లు మంత్రి తెలిపారు. దీంతో 2026-27 సంవత్సరంలో మొత్తం రూ. 3,000 కోట్ల వ్యయంతో స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధుల మెరుగుదల, ఆదాయ వృద్ధి, స్థిరమైన ఉపాధి అవకాశాల సృష్టిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రకటించిన ఒక కుటుంబంలో ఒక పారిశ్రమికవేత్త మహత్తర లక్ష్య సాధనలో భాగంగా సుమారు 5 లక్షల మహిళలను ఔత్సాహికులుగా తీర్చిదిద్దడం, అలాగే రైతు ఉత్పత్తి సంస్థలును బలోపేతం చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేయాలని ప్రభుత్వం సంకల్పంతో ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత సంవత్సరంతో పోలిస్తే గణనీయంగా అధిక బడ్జెట్ కేటాయించడమే కాకుండా, దీనదయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ ద్వారా లభించే నిధుల ఆధారంగా మొత్తం వ్యయాన్ని రూ. 3,000 కోట్లవరకు విస్తరించేందుకు దృఢ నిశ్చయంతో ముందుకు వస్తున్న ముఖ్యమంత్రికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం సహాయక సంఘాల మహిళల సమగ్ర సాధికారత, స్థిరమైన జీవనోపాధుల విస్తరణ, మరియు గ్రామీణ ఆర్థికాభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## జనసేనకు భారీ విరాళం

-మొదటిపేజీ తరువాయి

సమయం, ఆర్థికం, సాంకేతికం, సేవా, మేధో సహకారాలు అందించే వారిని “ప్రదాత”గా ఇకపై పిలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీ ప్రారంభంలో 150 మందితో మొదలైందని, 2021లో మొదటి విడత సభ్యత్వంలో 90 వేలు నమోదు అయ్యాయని పవన్ తెలిపారు. గత ఎన్నికల ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరిందని... ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. చిన్న వ్యాపారులు, కూలీలు, చదువుకున్నవారు అందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడిచేవారే ముఖ్యమని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేసినవారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

## త్రిముఖ వ్యూహంతో ఏపీ రైజింగ్



-మొదటిపేజీ తరువాయి

తీర్చిదిద్దానుంది. ఈ సంకల్పంతోనే బడ్జెట్‌లో వాటికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్రానికి కీలక గ్రోత్ ఇంజిన్లుగా: ఇప్పటికే ఆర్థికాభివృద్ధి ప్రణాళిక సిద్ధమైంది. తాజా బడ్జెట్‌లో విశాఖ ఎకనమిక్ రీజియన్‌కు రూ.500 కోట్లు కేటాయించింది. విశాఖ మెట్రో ట్రైన్‌తో సహా వీఈఆర్‌కు రూ.28 వేల కోట్లతో కేంద్రానకి ప్రతిపాదనలు సమర్పించనున్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల తెలిపారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రాలుగా మూడు ఆర్థిక అభివృద్ధి రీజియన్‌లను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఇవి రాష్ట్రానికి కీలక గ్రోత్ ఇంజిన్లుగానూ భావిస్తోంది. నీతి ఆయోగ్‌తో కలసి వీఈఆర్ ఆర్థికాభివృద్ధి ప్రణాళికను రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబరులో విడుదల చేసింది. అమరావతి, తిరుపతి, రీజియన్‌లకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించనుంది. త్వరలో నీతి ఆయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో ప్రణాళికలు రూపకల్పన చేయనున్నాయి. ఇంకా ప్రణాళికలు సిద్ధం కాలేదు. అయినా ఈ 2 ప్రాంతాల అభివృద్ధి దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించింది. రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఈ హబ్ ఏర్పాటుకు తాజాగా బడ్జెట్‌లో రూ.30 వేల కోట్లు ప్రకటించింది. అదే విధంగా అమరావతి రీజియన్లో రాజధాని నిర్మాణ పనులు రూ.57 వేల 868 కోట్ల వ్యయంతో చేపడుతోంది.

7 గ్రోత్ డ్రైవర్‌లను గుర్తించిన ప్రభుత్వం: విశాఖ ఆర్థిక రీజియన్‌లోకి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలు రానున్నాయి. వీఈఆర్‌ను 2032 నాటికి 125-135 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దనున్నారు. 60 నుంచి 70 బిలియన్ డాలర్ల జీవీఏ, 20 నుంచి 24 లక్షల ఉద్యోగాల సాధనే లక్ష్యంగా 7 గ్రోత్ డ్రైవర్లను ప్రభుత్వం గుర్తించింది. పోర్టు ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ హబ్, ఇన్నోవేషన్ హబ్, ఐటీ, డేటా సెంటర్, ఏఐ, వ్యవసాయం, పర్యాటకం వంటి 7 డ్రైవర్లను ఎంపిక చేసింది. మొత్తం 41 కీలక ప్రాజెక్టులు, పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర, ప్రైవేట్ సంస్థల నుంచి సమకూర్చుకుంటామని ఆర్థిక మంత్రి బడ్జెట్‌లో ప్రసంగంలో చెప్పారు. ముఖ్యమంత్రి చైర్‌పర్సన్‌గా వీఈఆర్ స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో పాటు ఆర్థిక, వ్యవసాయ, హోం, పరిశ్రమల, పురపాలక శాఖల మంత్రులను సభ్యులుగా నియమించారు. ఈ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలు: అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోకి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలు రానున్నాయి. దీని ప్రణాళికను నీతి ఆయోగ్‌తో కలిసి సింగపూర్ సంస్థలు రూపొందించనున్నాయి. రాజధాని అమరావతిలో ప్రభుత్వం క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్రంలో ఐటీ పరిశ్రమలు అన్నింటినీ ప్రోత్సహిస్తోంది. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ వంటి ప్రాజెక్టులతో పాటు ప్రముఖ విద్యా సంస్థలు ఇక్కడికే రావడం గమనార్హం. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, టెక్స్‌టైల్, సిమెంట్ క్లస్టర్లు, నాలెడ్జ్ హబ్, ఫైనాన్స్ హబ్‌లకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వనుంది. ఏమియేషన్, కమర్షియల్ హబ్‌లు కూడా రానున్నాయి. ఆక్వాకల్చర్ హబ్‌గా పశ్చిమగోదావరి జిల్లాను తీర్చిదిద్దబోతోంది. రాయలసీమ ఎకనమిక్ రీజియన్ ప్రణాళికను నీతి ఆయోగ్ రూపొందించనుంది. దీని పరిధిలోకి కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, వైఎస్సార్ కడప, అనంతపురం, శ్రీ సత్యసాయి. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు రానున్నాయి. రాయలసీమలో ఇప్పటికే పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టులను, ఉద్యాన రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఆటో మొబైల్, ఏవియేషన్, ఎలక్ట్రానిక్స్, సెల్‌ఫోన్‌ల తయారీ పరిశ్రమలు వంటివి ఆ ప్రాంతంలో పెద్దఎత్తున వస్తున్నాయి. అదే విధంగా సీమలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోంది.

# అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు

- నిబద్ధతతో పనిచేసే వాళ్లను కమిటీల్లోకి తీసుకోండి
- అందరినీ సమన్వయం చేసుకుని ముందుకెళ్లండి
- అనంత వెంకటరామిరెడ్డి





**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 15:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందజేశామని, కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రచార ఆర్భాటానికి మాత్రమే పరిమితం అవుతోందని పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని 16వ డివిజన్ పరిధిలోని బాబా నగర్ లో పార్టీ నాయకుడు సుకేశ్ ఆధ్వర్యంలో 'రచ్చబండ' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంకు పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. 20 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, అన్ని వర్గాలను చంద్రబాబు మోసం చేశారన్నారు. కీలకమైన హామీలు అమలు చేయకుండా సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు చేశామనడం చంద్రబాబు వెన్నుపోటుకు మరో నిదర్శనమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక 50 ఏళ్లకు పింఛన్ కథ దేవుడెరుగు ఉన్న పింఛన్ లను తొలగించారని విమర్శించారు. వైయస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు 45 ఏళ్ళు పైబడిన మహిళలకు జగనన్న చేయూత పథకం ద్వారా రూ.18,500 ఇచ్చేవారని, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక చేయుత పథకాన్ని అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం పార్టీతో పాటు అనుబంధ విభాగాల కమిటీలు కీలకమని తెలియజేశారు. అందరూ కలిసికట్టుగా పని చేసి జగన్మోహన్ రెడ్డి గారిని మరోసారి ముఖ్యమంత్రి ను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేయర్ వసీం, క్లస్టర్ ఇంచార్జ్ ఆలుమూరు శ్రీనువాస్ రెడ్డి, పరిశీలకులు కాగజ్ ఘర్ రిజ్వాన్, వైయస్సార్ సీపీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, వైయస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ మార్తా, నాయకులు ఖాజా, ముక్తియార్, రఫీ, ఎంఎం బాషా, జీఎం బాషా, లోకనాథ్ రెడ్డి, పీరా, జిలాన్, మబాష, రవి, వలి, నజీమ్, అల్తాఫ్, షామిర్, మసూద్ వలి, ఇనాయత్, సన్నక్క, సులోచన, తదితరులు పాల్గొన్నారు.

# అనంతలో 16న కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**అంకుశం న్యూస్ అనంతపురం, ఫిబ్రవరి 15 :** అనంతపురం జిల్లా అనంతపురం నగరంలోని కలెక్టరేట్లో ఈనెల ఫలాలు తారీఖున ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందనిమీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవఎిశీయఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**ఈనెల 16వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ :**

ఈనెల 16వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాయలసీమకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఓ వరం

- టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు



**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 15:** వైసీపీలో 11 మంది ఎమ్మెల్యేలు ఉంటే అసెంబ్లీకి వెళ్లి పట్టుమని 11 నిమిషాలు కూడా ఉండలేదని వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు గారిపై, కూటమి ప్రభుత్వంపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని అనంతపురం జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు గారు అన్నారు. ఇప్పుడు ఎవరిది అభద్రతాభావమో ప్రజలందరికీ అర్థమవుతోందని పూల నాగరాజు గారు మండిపడ్డారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై పూల నాగరాజు గారు తీవ్రంగా స్పందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభద్రతా భావంతో ఉన్నారంటూ అనంత చేసిన వ్యాఖ్యల మీద వారు స్పందిస్తూ.. ఆ వయసులో కూడా దేశ విదేశాలు తిరుగుతూ రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు తెస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎందుకు అభద్రత భావం ఉంటుందని ప్రశ్నించారు. అమరావతి నిర్మాణానికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తులు అత్యంత పవిత్రంగా భావించే తిరుమలలో లడ్డూ కల్తీ చేసిన పాపం వైసిపి నాయకులను వెంటాడుతోందన్నారు. దేశంలోనే అత్యున్నతంగా ఉన్న సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీట్ దర్యాప్తు చేసి అసలు అందులో నెయ్యే లేదని చెప్పినా, నేషనల్ డైరీ వారు ఇప్పటికే నెయ్యి కల్తీ జరిగిందని చెప్పినప్పటికీ కూడా వైసీపీ నాయకులు బుకాయిస్తున్నారన్నారు. అనంత వెంకట్రామిరెడ్డి కనీసం వయసుకు తగిన విధంగానైనా హుందాగా మాట్లాడలని సూచించారు. ఇప్పటికే మీరు చేసిన పాపాలకు ప్రజలు గట్టి తీర్పు ఇచ్చారన్నారు. 11 సీట్లకు పరిమితం చేసినా మీకు బుద్ధి రాకుండా ఇంకా మాట్లాడుతున్నారన్నారు. లడ్డు విషయాని డైవర్ట్ చేయడానికి అంబటి రాంబాబు లాంటి వారితో దూషణలు చేయించారన్నారు. ఇప్పటికే చాలామంది వైసిపి నాయకులు చేసిన పాపాలకు జైలు బాట పట్టారన్నారు. మీరు చేసిన దోపిడీలు, దౌర్జన్యాలకు ప్రజలు విసిగిపోయి కనీసం ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదన్నారు. ఇలాగే అబద్దాలను ప్రచారం చేస్తూ పోతే రానున్న రోజుల్లో ఇంకా గట్టిగా బుద్ధి చెబుతారన్నారు.సంక్షేమం, అభివృద్ధిలో ఎక్కడా రాజీ లేకుండా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఇందుకు నిదర్శనమే తాజా బడ్జెట్ అని పూల నాగరాజు గారు తెలిపారు. ప్రజల అవసరాలు ఓ వైపు, రాష్ట్రాభివృద్ధి ఇంకో వైపు, యువత, రైతాంగం మరోవైపు సమ ప్రాధాన్యతగా తీసుకుని బడ్జెట్ కూర్పు చేశారన్నారు. రాయలసీమ గ్లోబర్ హార్టీకల్చర్ హబ్ కు 30వేల కోట్ల రూపాయలు కేటాయించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ గారికి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హంద్రీనీవాకు ఈ బడ్జెట్ లో కూడా అధికంగా నిధులు కేటాయించడం వలన జిల్లాలో ఉన్న కీలక ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయన్నారు. విద్యుత్ రంగానికి 14వేల కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్‌పోర్టులకు 13వేల 546 కోట్ల కేటాయింపులతో పట్టణాల్లో అభివృద్ధి వేగంగా కనిపిస్తుందన్నారు. పరిశ్రమలకు 3వేల 161 కోట్లు కేటాయించడం ద్వారా పారిశ్రామికీకరణ వేగంగా ఉంటుందన్నారు. జల్ జీవన్‌కు 4వేల కోట్లు వంటివి తాగునీటి సమస్య పరిష్కారానికి దోహదపడుతాయని పూల నాగరాజు పేర్కొన్నారు.

## పుట్టపర్తిలో 16న కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఫిబ్రవరి 16:-** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి పట్టణంలోఈ నెల 16న సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా కేంద్రంతో పాటు మండల, డివిజన్ కేంద్రాలు, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

లిఅర్జీదారులు తమ దరఖాస్తులను జిల్లా కలెక్టరేట్ కు వచ్చే అవసరం లేకుండా '»meekosam.ap.gov.in»» లో ఆన్లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చునన్నారు. దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో ప్రస్తుత సమాచారం ఆన్లైన్లో తెలుస్తుందని లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ను సంప్రదించి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు తమ అర్జీలను సంబంధిత మండల, డివిజన్, మున్సిపాలిటీలలో అధికారులకు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు. కలెక్టరేట్లో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జిల్లా ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు

- మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట బందోబస్తు
- భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యం జిల్లా ఎస్పీ పి. జగదీష్





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని దేవాలయాలు వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నామనిజిల్లా ఎస్పీ శ్రీ పి. జగదీష్, తెలిపారు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. ముందస్తు జాగ్రత్తలు అమలు చేసి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరియు అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆయా పోలీసులు సమగ్ర చర్యలు తీసుకున్నారు. అని జగదీష్ అన్నారు. జిల్లాలోని ప్రధాన పుణ్యక్షేత్రాలు మరియు దేవాలయాల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు నిర్వహించారు. అనంతపురం మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వర దేవాలయం, కంబదూరు మల్లేశ్వర స్వామి దేవాలయం, తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, హిరెహాళ్ మండలం గవి సిద్దేశ్వర స్వామి ఆలయం, రాయదుర్గం పశుపతినాథ్ దేవాలయం, పెద్దపప్పూరు మండలం అశ్వర్థం, తదితర ముఖ్య దేవాలయాల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ఆధునిక సాంకేతికతతో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. అదనంగా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు, మహిళా పోలీసు సిబ్బంది నియామకం, తదితర చర్యలు చేపట్టారు. భక్తులు పోలీసు శాఖకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన పక్షంలో వెంటనే సమీప పోలీసు సిబ్బందికి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ జగదీష్ విజ్ఞప్తి చేశారు. మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరగేలా జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

## లేపాక్షి నాగపడగ శివలింగంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్





**అంకుశం న్యూస్ హిందూపురం ఫిబ్రవరి 15 :**మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లాలోని లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయంలో ఉన్న ప్రసిద్ధ నాగపడగ శివలింగం వద్ద ఈ రోజు ఘనంగా ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించగా, కలెక్టర్ భక్తిశ్రద్ధలతో స్వామివారికి ప్రార్థనలు సమర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి, మహాశివరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిపూర్వకంగా జరుగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్య,దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఈఓ, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ త్రిముఖ దుర్గా భర్గులేశ్వర స్వామివారిని దర్శించుకున్న దారపనేని






**కనిగిరి ఫిబ్రవరి 15 అంకుశం న్యూస్:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మార్కాపురం జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక, మరియు పుణ్యక్షేత్రమైన భైరవకోనలో ఆదివారం శ్రీ త్రిముఖ దుర్గా భర్గులేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దారపనేని కనిగిరి నియోజకవర్గం, ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని రైతులు సకాలంలో పంటలు పండించాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడు అమరావతి అభివృద్ధిని శరవేగంగా కొనసాగిస్తున్నారని, 2026-27 బడ్జెట్లో విద్య, వైద్య, ప్రాజెక్టులు, వ్యవసాయ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వారికి తగినంత మనోధైర్యాన్ని కల్పించాలని స్వామివారికి ప్రార్థించారు. భవిష్యత్తు నాయకులు నారా లోకేష్ బాబు విద్యారంగంలో తెస్తున్న విప్లవాత్మకమైన విధానాలతో మేధావులు సైతం హర్షం ప్రకటిస్తున్నారని దారపనేని పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన గత 77 సంవత్సరాల లో ఇటువంటి బడ్జెట్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి రావటం హర్షించదగ్గ పరిణామం అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు కు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు , కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి దారపనేని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం నిర్వాహకులు దారపనేని చంద్రశేఖర్ కు స్వామివారి పట్టు వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణారెడ్డి, భైరవకోన దేవస్థానం చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ సుందర్ రాజు, ముప్పాళ్ళ సుందర్ రాజు, ముప్పాళ్ళ చంద్రశేఖర్ రాజు, నరసరాజు, శ్రీనివాసరాజు, గుంటి మదుగు వెంకట రామరాజు, ముప్పాళ్ళ శ్రీనివాసరాజు (ఎం ఆర్) దేవస్థానం ప్రధాన అర్చకులు, దారపనేని మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఎన్.ఎమ్.డి. ఫరూక్‌కు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన ఆర్యవైశ్య నాయకులు



**అంకుశం ప్రతినిధి నంద్యాల ఫిబ్రవరి 15 :**నంద్యాల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని ఆర్యవైశ్య న్యాయవాదుల సంఘం కన్వీనర్ గంగిశెట్టి రాజేశ్వరరావు మరియు మహానంది తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కుంచపు రమణ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా గంగిశెట్టి రాజేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ, ముఖ్యంగా న్యాయవాద వృత్తిలో ఉన్న మిత్రులకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు . మంత్రి ఫరూక్ గారు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, న్యాయశాఖ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని . ఈ పండుగ రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నామని తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శివుని ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని కోరుకుంటున్నాను అన్నారు . ప్రభుత్వం తరఫున న్యాయశాఖ ద్వారా సామాన్యులకు వేగంగా న్యాయం అందేలా, అలాగే మైనార్టీల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఆర్యవైశ్య న్యాయవాదుల సంఘం మరియు పార్టీ నాయకులు చూపిస్తున్న ఈ అభిమానం సంతోషదాయకం అని పేర్కొన్నారు

# భక్తుల మనోరథాన్ని అధిరోహించిన దేవదేవుడు

- మంగళ వాయిద్యాల మధ్య, గోవింద నినాదాలతో ఘనంగా రథయాత్ర
- పండుగ వాతావరణంలో రథోత్సవ మహోత్సవం

**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 15 :** శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారు రథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.45 గం.లకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి రథోత్సవ మహోత్సవం పండుగ వాతావరణంలో ప్రారంభమైంది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణల మధ్య స్వామివారి రథం నాలుగు మాడ వీధులలో మహా వైభవంగా రథయాత్ర సాగింది. రథోత్సవం సందర్భంగా భక్తుల సందడి, విశ్వాసం, ఆనందోత్సాహాలు ప్రత్యేకంగా కనిపించాయి.

"గోవిందాడ గోవిందాడ" అంటూ నినాదాలు చేస్తూ రథాన్ని లాగిన భక్తులు, తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు. దేవదేవుడి దివ్య దర్శనం కోసం చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా,




మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

శ్రీవారి రథాన్ని దర్శించిన వారికి జన్మాదిదుఃఖాలు నశించి, మోక్షం లభిస్తుంది. రథస్థుడైన మాధవుడిని దర్శిస్తే పునర్జన్మ ఉండదని అర్చకులు తెలిపారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు అశ్వ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. రథోత్సవంలో ఎస్ఇ మనోహరం, ఆలయ ప్రత్యేక అధికారి మరియు సిపిఆర్వో డా. టి.రవి, ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, వీజీవో సురేంద్ర, ఏఈవో గోపినాథ్, కంకణభట్టర్ శ్రీ బాలాజీ



రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీ మునికుమార్, శ్రీ ధన శేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**ఫిబ్రవరి 16న చక్రస్నానం :**

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఉదయం చక్రస్నానం వైభవంగా జరుగనుంది. ఇందులో భాగంగా ఉదయం 9.00 గం.ల నుండి 09.55 గం.ల మధ్య వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 9.55 గం.లకు ఆలయం ఎదురుగా గల పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు శాస్త్రోక్తంగా చక్రస్నానం జరుగనుంది.

# ల్యాండ్ పుల్లింగ్ ల్యాండ్ గ్రాఫింగ్ కు తేడా తెలీదు

- ముస్లిం స్థలాలను కాపాడుకుంటాం
- షకీల్ షఫీ రాష్ట్ర అధ్యక్షులు ఏపీ మూతవల్లి సంఘం

**అంకుశం న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 15 :** ప్రతిపక్ష పార్టీలు ల్యాండ్ పులింగ్ కు ల్యాండ్ గ్రాఫింగ్ కు తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని ముస్లిం స్థలాలను అన్ని కాపాడుకుంటామని ముస్లింలందరూ ఐక్యంగా ఉంటూ ప్రభుత్వానికి సహకరించాలని ఏపీ మూతవల్లి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీపిలుపునిచ్చారు. అనంతపురం పట్టణంలో నేడు రాష్ట్ర ముతవల్లిల సంఘం జనరల్ బాడీ సమావేశము శ్రీ కె.యం షకిల్ షఫీ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా అనేకమందిలు ఈ సమావేశానికి హాజరయ్యారు. వక్ఫ్ స్థలాలను ప్రభుత్వము లాండ్ పుల్లింగ్ ద్వారా స్వాధీన పరుచుకుంటుందని తద్వారా ప్రతిపక్షాలు లేనిపోని అపోహలు సృష్టించి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలా చేస్తున్నారని, ల్యాండ్ పుల్లింగ్ కి ల్యాండ్ గ్రాబింగ్ కి అర్థం కూడా తెలియని విధంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ల్యాండ్ పుల్లింగ్ ద్వారా ముస్లిం సోదరులకు ప్రజలకు ఏ రకమైన లబ్ధి చేకూరుస్తుందో దానికి సంబంధించిన రూల్స్ విధివిధానాలు తయారు చేసి ల్యాండ్ పుల్లింగ్ కంటే ముందే ప్రజలకు ముతవల్లిలకు తెలియచేసిన అవసరం ఎంతైనా ఉందని షకీల్ షఫీ అన్నారుదీనివల్ల ప్రభుత్వ ఉద్దేశము మైనారిటీలకు ఏ రకంగా అభివృద్ధి చెందాలి అనే భావన కూడా తప్పకుండా అమలు పరచడానికి వీలవుతుందని తెలియజేశారు. ప్రతిపక్షాలు చేసే నిరసనలు మాని ఏమి చేస్తే ఆ యొక్క స్థలాలలో అభివృద్ధి చేసి తద్వారా ఆదాయ వనరులు పెంచుకునేలా ప్రణాళిక రూపొందించే దిశగా సలహాలు ఇవ్వాలని తెలియజేశారు. ఉదాహరణకు అనంతపురంలో పదివేల ఎకరాలు ఉండగా దాదాపు 330




ముతవల్లిలు ఉన్నారని దాదాపు 7 ఎకరాలు అన్యాక్రాంతమై ల్యాండ్ గ్రాబర్లు చేతిలో లిటిగేషన్లలో కోర్టు వ్యవహారాలలో సతమతమత అవుతున్నాయని తెలియజేశారు. ల్యాండ్ పుల్లింగ్ చేసే ప్రభుత్వ ఆలోచనకు తమ వంతు సూచనలు ఇచ్చి ప్రభుత్వానికి ల్యాండ్ విల్లింగ్ తోనే తోనే స్థలాలు ఇస్తామని ముతువల్లిల సంఘం సర్వసభ్య సమావేశం తెలియజేసింది.ల్యాండ్ పుల్లింగ్ చేసేముందు ఒక ప్రణాళికను రూపొందించి ఆ ప్రణాళికను ప్రజలకు ఆ యొక్క ఇన్స్టిట్యూషన్కు విధి విధానాలు తెలియజేయాలని ఒక కమిటీని వేసి వారు చేసే సూచనలు పరిగణలో తీసుకొని ల్యాండ్ పుల్లింగ్ చేస్తే బాగుంటుందని తెలిపారు. అనేక అపోహల కు దారి తీయకుండా ప్రతిపక్షాల ఆందోళనలకు పట్టు దొరకకుండా ఉంటుందని తెలియజేశారు. నెల్లూరులో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ చేపడుతున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా సంస్థల గురించి కూడా జనరల్ బాడీ సమావేశము ఎంతో ప్రశంసించింది. గుంటూరు అంజుమన్ విషయములో కొద్దిగా తొందరపాటుతో ముందుకెళ్ళినట్లు



భావిస్తున్నామని ముతవల్లిసంఘంతో జిల్లా అధికారులు సమావేశమై తద్వారా అంజుమన్ భూములలో అభివృద్ధి ప్రణాళిక , ముస్లిం సామాజియా వర్గానికి మరియు అంజుమన్ కు ఏ రకంగా లాభము చేకూరుస్తుందో ప్రకటించిన తర్వాత పనులు చేపట్టాలని తెలియజేశారు. భవిష్యత్తులో ల్యాండ్ పుల్లింగ్ విధానాన్ని అమలుపరచకుండా మా విల్లింగ్ తోనే వక్ఫ్ స్థలాలు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వము ల్యాండ్ పుల్లింగ్ గాని ల్యాండ్ అక్విజేషన్ గాని చేయాలన్నప్పుడు వక్ఫ్ చట్టం ప్రకారం సెక్షన్ 51 తూచా తప్పకుండా పాటించాలని షకీల్ షఫీ తెలిపారు. ఈ సమావేశానికి వందలాదిమంది ముతవల్లీలు, రాష్ట్ర ముతవల్లీల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ ఉబేదుల్లా హుసేని , పెనుగొండ దర్గా సజ్జాదేనషిన్ తాజ్ బాబా , జమ్మలమడుగు సజ్జాదేనషిన్ తాహెర్ పీర్ కడప హర్షద్ సాహెబ్ గారు, గుత్తి అన్వర్ పాషా , రాయదుర్గం ఉరవకొండ కదిరి హిందూపూర్ పెనుగొండ రాప్తాడు కర్నూలు గుంటూరు విజయవాడ నుంచి అనేకమంది ముతవల్లీలు హాజరయ్యారు.

# కపిలేశ్వరాలయంలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

- భక్తజనోహం మధ్య భోగితేరు ఊరేగింపు

**అంకుశం న్యూస్ తిరుపతి ఫిబ్రవరి 15 :** తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా క్యూలైన్లు, చలువపందిళ్లు, పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. ఆలయంలో ఉదయం 6 గంటలకు సర్వదర్శనం ప్రారంభమైంది. పెద్దసంఖ్యలో భక్తులు శ్రీ కపిలేశ్వరస్వామివారిని, శ్రీకామాక్షి అమ్మవారిని దర్శించుకున్నారు. వేడుకగా భోగితేరు ఊరేగింపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు భోగితేరు ఊరేగింపు వేడుకగా జరిగింది. భజనమండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో రథోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. ఆత్మ రథికుడు. శరీరమే రథం. బుద్ధి సారథి. మనస్సు పగ్గం. ఇంద్రియాలే గుర్రాలు. విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూలశరీరం వేరని, సూక్ష్మ శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ




వివేకం కలుగుతుంది. ఆ తరువాత ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీసోమస్కందమూర్తి, శ్రీ కామాక్షి దేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. స్వామి, అమ్మవార్లకు ఉపచారాలు నిర్వహించారు. ఫిబ్రవరి 16న శివపార్వతుల కల్యాణంశ్రీ కామాక్షి సమేత కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి మరుసటి రోజైన



శనివారం శివపార్వతుల కల్యాణమహోత్సవం జరుగనుంది. సాయంత్రం 6 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఆర్జితసేవగా ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. గృహస్తులు (ఇద్దరు) అప్పటికప్పుడు రూ.500/- చెల్లించి టికెట్ కొనుగోలు చేసి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు లడ్డూ ప్రసాదం బహుమానంగా అందజేస్తారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ చంద్రశేఖర్, విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## స్వయంగా రథం లాగి ఉత్సవాలను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 15:** ధర్మవరం పట్టణంలోని శివానగర్ శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో రాష్ట్ర వైద్య & ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథానికి అర్చన చేసి, స్వయంగా రథం లాగి రథోత్సవాన్ని ఘనంగా ప్రారంభించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి, భక్తి గీతాలు, హరహర మహాదేవ శబ్దాలతో



ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని రథోత్సవాన్ని వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ రాష్ట్ర ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. పరమశివుడి కృపతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, ఐశ్వర్యసంపదలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించారు. మహాశివరాత్రి పర్వదినం మనలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించి, ధర్మ మార్గంలో నడిచే స్ఫూర్తిని కలిగించాలని ఆకాంక్షించారు.

## రామ్నగర్ ఆలయానికి విరాళం అందించిన చిలకం మధుసూదన్ రెడ్డి.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని పట్టణంలోని రామ్ నగర్ లో గల శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి సమేత జల లింగేశ్వర స్వామి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం లో భాగంగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి , సతీమణి ఛాయాదేవి తో కలిసిఆలయానికి వెళ్లి



అర్చకులు ద్వారా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అక్కడే కొంత సమయమును గడిపి దేవాలయ వాతావరణాన్ని ఆస్వాదించి ఆలయ ప్రాంగణంలో భక్తులతో కాసేపు మమేకమయ్యారు. తదుపరి ఆలయ అభివృద్ధి కోసం దంపతులు ఆలయ కమిటీ వారికి రూ.10,016 రూపాయలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ వారు దంపతులను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలను తెలియజేశారు.

## జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహనాల తనిఖీలు...

- రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు
- అనంత జిల్లా ఎస్పీ పి జగదీష్

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఫిబ్రవరి 15 :** అనంతపురం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున వాహనాలను తనిఖీ చేస్తున్నామని రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదనిజిల్లా ఎస్పీ పి. జగదీష్, అన్నారు జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూఈరోజు జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖ వాహనాల తనిఖీలను ముమ్మరంగా చేపట్టింది. రోడ్డు భద్రతను దృష్టిలో పెట్టుకుని వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారులు, పట్టణ ప్రాంతాలు, జాతీయ మరియు రాష్ట్ర రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అని అన్నారు సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, అతివేగం వంటి రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ జగదీష్ వివరించారు . అదనంగా అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ రవాణా, నిషేధిత వస్తువుల తరలింపు వంటి అంశాలపై కూడా తనిఖీలు నిర్వహించారు. ఆయా పోలీసులు ...ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడాలని జిల్లా ఎస్పీ జగదీష్ సూచించారు.







## మహిమాన్విత శివాలయం కనికెల గుండం

**.పోరుమామిళ్ల / కాశినాయన, ఫిబ్రవరి 15(అంకుశం పత్రిక):** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కాశినాయన మండలంలోని రంపాడు పంచాయితీలో సగిలేరు ఒడ్డున వెలసివున్న కనికెల గుండం పరమేశ్వరస్వామి మహోత్సవాన్ని వరదగొల్ల గురయ్య తన మిత్రులు, గ్రామపెద్దలతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే మహిళలు, పిల్లలు, పురుషులు స్వామివారి దర్శనభాగ్యం కోసం క్యూ కట్టడం జరిగింది. వచ్చిన భక్తులందరికీ ఉదయం అల్పాహారంతో బాటు, మధ్యాహ్నం భోజన వసతులు కూడా ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కనికెల గుండం పరమేశ్వరస్వామి 250 సంవత్సరాల నాటి పురాతన దక్షణ ద్వారం కల్గిన మహిమాన్విత శివాలయం అని, ఈ స్వామిని దర్శించుకుంటే కాశీ విశ్వేశ్వరుని దర్శించుకున్నట్లే అని గ్రామస్తులు చెబుతున్నారు. ఇలాంటి దక్షణ ద్వారం కల్గివున్న శివాలయాలు భారతదేశంలో మూడే వున్నాయని ఒకటి కాశి, రెండవది గద్వాల్ జోగులాంబ దేవాలయం, మూడవది ఈ కనికెల గుండం పరమేశ్వరస్వామి స్వామి ఆలయం అన్నారు.ఈ దేవాలయ ప్రాంతంలో వున్న సగిలేరు ఒడ్డున అక్కదేవతలు అలంకరణలు చేసుకొనే వారని పూర్వంనుంచి ప్రతీతి. పది సంవత్సరాల నుండి ప్రతి మహాశివరాత్రికి, కార్తీక పౌర్ణమికి స్వామివారి మహోత్సవ కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ కార్యకర్త వరదగొల్ల గురయ్య చెబుతున్నారు. ఇంతటి మహిమాన్వితమైన శివాలయం అభివృద్ధికి నోచుకోలేదని, ఇక్కడకు వచ్చేందుకు సరియిన దారికూడా లేదని అంటున్నారు. ఓబులాపురం గ్రామం గుండా ఇక్కడకు వచ్చేందుకు అవసరమైన దారిని ఇచ్చేందుకు రైతులు కూడా సిద్ధంగా వున్నారని ప్రభుత్వం కూడా సహకరించాలని కోరుతున్నారు. దాతల సహకారంతో వరదగొల్ల గురయ్య, ఆలయ ధర్మకర్త వరదగొల్ల చిన్న గురయ్య, సిద్దమూర్తి జయరామిరెడ్డి, సిద్దమూర్తి దిగురెడ్డి, కల్లూరి శ్రీనివాసులు, కల్లూరు గోపాలరెడ్డి, పాలకొండు శ్రీరామ్ రెడ్డి,కావూరి పార్థసారధి నాయుడు, బాలుడు, దీపక్ నాయుడు తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చక్కటి వసతులను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## మహాశివరాత్రి సందర్భంగా సంకేపల్లి పరసమాను... శ్రీ వీర నారాయణ స్వామి ఆలయం దర్శించిన మంత్రి సత్య కుమార్ యాదవ్.

**అంకుశం న్యూస్ ధర్మవరం ఫిబ్రవరి 15:** ఆధ్యాత్మిక సేవతో పాటు అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు మంత్రి సత్య కుమార్ యాదవ్. 54 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు మరియు టాయిలెట్ టాయిలెట్లను ప్రారంభించిన మంత్రి సత్య కుమార్ యాదవ్



భక్తుల సౌకర్యాలే లక్ష్యం వీర నారాయణ స్వామి పరసమానులో 54 లక్షల అభివృద్ధి పనులు పూర్తి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలుడ అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల మనసులు గెలుచుకున్న మంత్రి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వైద్య & ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముదిగుబ్బ మండలం సంకేపల్లి పరసమానులోని వీర నారాయణ స్వామి ఆలయంను భక్తిశ్రద్ధలతో దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంత అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని మంత్రి స్పష్టం చేశారు. 2024 ఎన్నికల ప్రచార సమయంలో భక్తులకు మరియు గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ, వీర నారాయణ స్వామి పరసమానులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు సౌకర్యవంతంగా ఆలయానికి చేరుకునే విధంగా సుమారు రూ.40 లక్షల వ్యయంతో సిసి రోడ్ల నిర్మాణం పూర్తిచేయించగా, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.14 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో టాయిలెట్ నిర్మాణం కూడా చేపట్టబడింది. ఈ అభివృద్ధి పనులను మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు స్వయంగా ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి మరియు భక్తుల సౌకర్యాల పట్ల మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ప్రత్యేక శ్రద్ధ స్థానిక ప్రజల్లో విశేష సంతోషాన్ని కలిగిస్తోంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఆయన చూపుతున్న నిబద్ధత ప్రజా సేవకు ఆయన అంకితభావానికి నిదర్శనమని స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం మాత్రమే కాకుండా, ప్రాంతీయ అభివృద్ధికి కూడా దోహదం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరుస్తున్నాయి.